చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

దుండిగల్: మూడు సంవత్సరాలు పైబడిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ గాజులరామారం సెక్టార్ సూపర్‌వైజర్ స్వందన అన్నారు. రోడామేస్త్రీనగర్‌లో బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం 'బడి గంట' అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీలో చిన్నారులకు క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్య, పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని తెలిపారు. అదే విధంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతో పాటు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రజిత, మతిన్, ముబిన్, అంజలమ్మ, రత్న, మాధవి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణమ్మకు డాక్టరేట్ ప్రదానం



దుండిగల్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ (ఐఏఇఆర్ఇ) కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణమ్మకు డాక్టరేట్ లభించింది. దుండిగల్‌లోని ఐఏఆర్ఈ కళాశాలలో సీఎస్ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న లక్ష్మీనారాయణమ్మ కంప్యూటర్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు.

బదిలీపై వెళ్తున్న పోలీసులకు సన్మానం



జీడిమెట్ల: పోలీసులు ఎక్కడ ఉద్యోగం చేసినా కంకణబద్ధులై పనిచేయాలని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ అన్నారు. జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పలువురు సిబ్బంది జీడిమెట్ల నుంచి ఇతర ఠాణాలకు బదిలీ అయ్యారు. వారిని సన్మానించి మాట్లాడారు. పోలీసు వృత్తి అంటేనే లా అండ్ ఆర్డర్‌ను పరిరక్షించడం అని, ఎక్కడ ఉన్న డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. బదిలీపై వెళ్లిన వారిలో ఏఎస్ఐ సురేష్, హెడ్ కానిస్టేబుళ్లు స్వరూప, మహాదేవ్, కానిస్టేబుళ్లు మణిరత్నకుమారి, లక్ష్మణ్, ప్రకాష్ ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం



నిజాంపేట్: బైరవోని చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బైరవోని చెరువులో గుర్తు తెలియని మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. అతని వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని తెలిపారు. చామన ఛాయ, ఆకుపచ్చ రంగు టీషర్టు, నలుపు రంగు ట్రాక్ ప్యాంట్, మెడలో రుద్రాక్ష మాల ఉన్నట్లు పోలీసులు వివరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి గురించి తెలిసినవారు 9491060942 / 8333993552 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్

రంగారెడ్డినగర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ అన్నారు. బుధవారం చింతల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రంగారెడ్డినగర్ డివిజన్ పంచశీల కాలనీకి చెందిన మధుస్మిత జెన (25)కు మంజూరైన రూ.1.40 లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ పత్రాన్ని లబ్ధిదారురాలి తండ్రి సురేంద్ర కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బడికి వేళాయే!

- విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా అధికారులు, ఉపాధ్యాయుల కృషి
- పక్షం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు
- ఇప్పటికే పాఠశాలలకు చేరిన పుస్తకాలు, యూనిఫాం

నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలల పున: ప్రారంభం

ప్రభుత్వ పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ఎండాకాలం సెలవులు, ఆటలకు స్వస్తి పలికి బడిబాట పట్టనున్నారు. విద్యార్థులకు సరిపడా పుస్తకాలు, యూనిఫాం అందజేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధం చేసింది. ఇప్పటికే పాఠశాలలకు చేరుకున్నాయి. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు బడిబాట కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు, సౌకర్యాలు తదితర వాటిని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు.



భౌరంపేటలో బడిబాట కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

దుండిగల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా విద్యాశాఖ అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే ప్రణాళికలు సైతం రూపొంది ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'బడి-బాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ పాఠశాలలు పున: ప్రారంభం నేపథ్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించే విధంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

→ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కుత్బుల్లాపూర్, గండిమైసమ్మ-దుండిగల్, బాచుపల్లి మండలాల్లో మొత్తం 107 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 21 ఉన్నత, ఒకటి ప్రాథమికోన్నత, 85 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. 2023-24 విద్యా సంవత్సరంలో ప్రాథమిక పాఠశాలల్లో 11,235 విద్యార్థులు, ఉన్నత పాఠశాలల్లో 12,034 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతి ఏడాది 800 నుంచి 1800 వరకు విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందుతున్నారు. ఈ దఫా వాటి సంఖ్య రెండింతలు పెంచే విధంగా కృషి చేస్తున్నారు.

బడిబాటతో అవగాహన

విద్యార్థుల హాజరు శాతం పెంచే ప్రధాన ఉద్దేశంతో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బడీడు పిల్లలందరిని తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. వీటిపై రాష్ట్ర విద్యా శాఖ ఇప్పటికే మార్గదర్శకాలను రూపొందించింది. 6వ తేదీ నుంచి పక్షం రోజుల పాటు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రజా ప్రతినిధులతో ప్రారంభించాలని, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలను అందించాలని, సామూహిక అక్షరాభ్యాసం, బాలల సభ, విలీన విద్య, బాలిక విద్యా దినోత్సవం, తరగతి గదుల డిజిటల్ కరణపై అవగాహన, మొక్కల పెంపకంపై ప్రాధాన్యత, క్రీడా పోటీలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేశారు.

పాఠశాలలకు చేరిన పుస్తకాలు, యూనిఫాం

మూడు మండలాలకు సంబంధించిన ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మొత్తం 23,269 మంది విద్యార్థులు ఉన్నారు. గత విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని ఈ విద్యా సంవత్సరంలో 1,26,175 పాఠ్య పుస్తకాలను ఆయా పాఠశాలకు అందజేశారు. మిగిలిన పుస్తకాలను మరో రెండు రోజుల్లో సరఫరా చేయనున్నారు. అదే విధంగా మొదటి విడుతగా ఒక్కో విద్యార్థికి ఒక యూనిఫాం చొప్పున అందజేయనున్నారు. మరో దఫా మరో జతను అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.



విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి



బడి బాట కార్యక్రమంలో భాగంగా అడ్మిషన్లు విస్తృతంగా జరుగుతున్నాయి. ఇప్పటికే అన్ని పాఠశాలలకు పుస్తకాలు, యూనిఫాంలను అందజేశాం. బడి బాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఏడాది రెండు వేలకు పైగా కొత్తగా అడ్మిషన్లు చేసే విధంగా ప్రయతిస్తున్నాం.

– జెమిని కుమారి, ఎంఈఓ, కుత్బుల్లాపూర్.



పాఠశాలలకు చేరిన పుస్తకాలు, యూనిఫాం

కేసీఆర్‌కు మద్దతుగా బీఆర్ఎస్ ర్యాలీ

కుత్బుల్లాపూర్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరు నేపథ్యంలో బుధవారం కుత్బుల్లాపూర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వివేకానంద్ ఆధ్వర్యంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బీఆర్‌కే భవన్‌కు తరలివెళ్లారు.



ర్యాలీలో బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్



క్షేత్రస్థాయిలో కష్టపడి పని చేయాలి

కుత్బుల్లాపూర్: క్షేత్రస్థాయిలో కార్యకర్తలు కష్టపడి పని చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏర్పడి 11 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం జీడిమెట్ల డివిజన్ అధ్యక్షుడు కట్టా కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం డివిజన్ నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో అభ్యర్థులు విజయం సాధించేందుకు కృషి చేయాలన్నారు. వసంశెట్టి శ్రీనివాస్, రాజేశ్వర్‌చారి, శ్రీధర్ వర్మ, నటరాజ్‌గౌడ్, దయాకర్, బూత్ లెవల్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికులకు దుప్పట్లు పంపిణీ

దుండిగల్: టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు నర్సారెడ్డి భూపతిరెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం కుత్బుల్లాపూర్‌లోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. బహదూర్‌పల్లిలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అదే విధంగా పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు.





చెత్తను కాల్చి చేతులు ఎత్తేశారు !

కుత్బుల్లాపూర్: సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని శివాలయం దేవాలయం వద్ద ప్రతిరోజు చెత్తను పారిశుద్ధ్య కార్మికులు స్థానికంగా ఉండే ఖాళీ ప్లాట్ లలో తగలబెట్టడం పరిపాటిగా మారింది. సంబంధిత విభాగం అధికారుల సమన్వయ లోపం కారణంగా ప్రతిరోజు ఇదే తరహాలో విధులు నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను కాల్చి వేయకుండా కట్టడి చేయాలని కోరుతున్నారు.

ప్రమాదమని తెలిసినా!

కుత్బుల్లాపూర్ : సుచిత్ర నుంచి కుత్బుల్లాపూర్‌కు వెళ్లే రోడ్డులో వాహనదారులు అడ్డదిడ్డంగా ప్రయాణం చేస్తూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. ఒకవైపు డివైడర్లు ఏర్పాటు చేసినా మరోవైపు వాహనదారులు ఇష్టానుసారంగా ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఎదురుగా వాహనాలు వస్తున్న డోంట్ కేర్ అంటూ.. దూసుకుపోతున్నారు. అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు ఒకవైపు చలానాలు విధిస్తున్న వాహనదారులు మాత్రం పట్టించుకోకపోవడం విశేషం.



తొలగించారు సరే.. తరలించేవారెవరు?



కుత్బుల్లాపూర్: వినాయకనగర్ నుంచి జీడిమెట్ల పారిశ్రామికవాడకు వెళ్లే రోడ్డులో ఇలా చెట్ల కొమ్మలు తొలగించి రోడ్డుపైనే వేశారు. విద్యుత్ శాఖ అధికారులు వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని రెండు రోజుల క్రితం ఇక్కడ చెట్ల కొమ్మలను కొట్టేశారు. అంతవరకు బాగానే ఉంది. వాటిని మాత్రం రోడ్డు పైనే వదిలివేయడం మూలంగా అటువైపుగా వెళ్లే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

లాలించి చదువు చెప్పే ఒడి అంగన్‌వాడీ బడి


రంగారెడ్డినగర్: చిన్నారులను లాలించి చదువు చెప్పే ఒడి అంగన్‌వాడీ బడి అని సమగ్ర శిశు అభివృద్ధి సంస్థ(ఐసీడీఎస్)రంగారెడ్డినగర్ సెక్టార్ సూపర్ వైజర్ జె.జ్యోతి అన్నారు. 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా బుధవారం రంగారెడ్డినగర్ సెక్టార్ పరిధిలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో గిరినగర్, గుడెన్‌మెట్, రంగారెడ్డినగర్, చెన్నారెడ్డినగర్, నందానగర్, గాంధీనగర్, వెంకట్రామిరెడ్డి నగర్ ప్రాంతాల్లోని పురవీధులలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ముందుగా అంగన్‌వాడీ కేంద్రంలో 2+ పిల్లల, తల్లులతో సమావేశాలు నిర్వహించారు. ప్రీ స్కూల్ మెటీరియల్ వాటి ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో ఆయా కేంద్రాల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఏఎన్ఎంలు, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతల్: ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు ఆయా ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు బోయిన్పల్లి ఏడీఈ శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. న్యూ బోయిన్పల్లి సబ్‌స్టేషన్ 33/11 కేవీ రిలయన్స్ విల్లా ఫీడర్ పరిధిలో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు శ్రీ మలాని కాలనీ, రిలయన్స్ విల్లా అపార్ట్‌మెంట్స్, రాఘవేంద్ర హాస్పిటల్ లైన్, సత్య టవర్స్, చందన హాస్పిటల్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండున్నర నుంచి 5:30 గంటల వరకు ఆనంద నగర్, అమర జ్యోతి కాలనీ, భావన కాలనీ, సెంటర్ పాయింట్, పద్మజా నగర్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ లైన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.



నిజాంపేట్: హెచ్ఎంటీ హిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ బృందావన్ కాలనీ ఫీడర్‌లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు సద్గురు అపార్ట్‌మెంట్, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ప్రాంతం, బృందావన్ కాలనీ, హైదర్‌నగర్, మయూరి నగర్ భాగం, అలాగే మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు వృద్ధాశ్రమం, మయూరి నగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.





నైపుణ్యాల వేదిక.. ఎస్‌పీఆర్

11 ఏళ్లుగా ఉచిత శిక్షణ

- వివిధ అంశాల్లో పట్టుసాధించిన విద్యార్థులు
- మే 1 నుంచి జూన్ 8 వరకు కొనసాగిన క్యాంప్

సుభాష్‌నగర్: వేసవి కాలం సెలవుల్లో భాగంగా విద్యార్థుల యొక్క సమయం వృథా కాకుండా వారిలో నైపుణ్యాన్ని పెంచేందుకు ఎస్‌పీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతి ఏటా వేసవి కాలం ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహిస్తుంది. ఈ ఏటా గాజులరామారంలోని ఎస్‌పీఆర్ గ్లోబల్ స్కూల్ 11వ ఉచిత శిక్షణ శిబిరానికి వేదికైంది. మే 1 నుంచి జూన్8వ తేదీ వరకు శిక్షణ కొనసాగింది. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, అబాకస్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, చేతి రాత, కంప్యూటర్, కర్ర సాములపై 120 మంది విద్యార్థులకు వివిధ కోర్సులపై నైపుణ్యం కలిగిన వారిచే శిక్షణనిస్తూ విద్యార్థులకు చదువుతో పాటు ఇతర నైపుణ్యాన్ని పెంపొందిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో పలు కోర్సులపై శిక్షణ అందించారు.

సులభ పద్ధతిలో బోధన

విద్యార్థులు ఇంగ్లిషులో అనర్గళంగా మాట్లాడేందుకు స్పోకెన్ ఇంగ్లిష్ పై నిత్యం తర్ఫీదు ఇస్తున్నారు. విద్యార్థుల్లో మ్యాథ్స్ భయం పోగొట్టడానికి అబాకస్ ద్వారా సులభమైన పద్ధతిలో శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు చదువుతోపాటు తమ కాళ్లపై నిలబడేందుకు ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌ను చీరలు, వస్త్రాలపై వివిధ ఆకారాలలో డ్రాయింగ్ వేయించారు. మహిళలు శత్రువుల నుంచి తనకు తాము కాపాడుకోవడానికి కర్ర సాముపై ప్రత్యేక ట్రిక్కులు నేర్పించారు.



ఎస్‌పీఆర్ ఎల్లప్పుడు అండగా ఉంటుంది



ఎస్‌పీఆర్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించినప్పటి నుంచి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కరోనా సమయంలో కూడా ప్రజలకు అండగా ఉన్నాం. పేద విద్యార్థులకు నైపుణ్యాన్ని పెంచేందుకు 11వ సంవత్సరం ఆరు కోర్సులపై విజయవంతంగా ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహించాం. ముమ్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతాం.

–సొంటి రెడ్డి పున్నారెడ్డి, ఎస్‌పీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్.

ఇంగ్లిష్‌పై భయం పోగొట్టేందుకు..



నేటి కంప్యూటర్ యుగంలో ప్రతి ఒక్కరికి ఇంగ్లిష్ తప్పనిసరి. చాలామంది విద్యార్థులు చదువులో రాణిస్తున్నా ఇంగ్లిష్‌లో మాత్రం కొంత మేర వెనకడుగు వేయడంతో ఇంటర్వ్యూలో రాణించలేకపోతున్నారు. వారిలో ఇంగ్లిష్ భయం పోగొట్టేందుకు సులభమైన పద్ధతిలో స్పోకెన్ ఇంగ్లిష్, హ్యాండ్ రైటింగ్, బాడీ లాంగ్వేజ్ లపై శిక్షణ ఇచ్చాం. దీంతో చాలామంది పిల్లలు భయం లేకుండా ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లాడగలుగుతున్నారు.

–గ్లోరీ విల్సన్, ఎస్‌పీఆర్ స్కూల్ ప్రిన్సిపాల్

ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై పట్టు సాధించా



వేసవి శిక్షణ శిబిరంలోని ఫ్యాబ్రిక్ పెయింటింగ్ పై పట్టు సాధించా. సహజమైన కలర్స్‌తో చీరలు, వస్త్రాలపై వివిధ ఆకారాలలో డ్రాయింగ్ వేస్తున్న. చదువుతో పాటు ఖాళీ సమయాల్లో ఇంటి వద్ద ఉపాధి పొందేందుకు నాకు ధైర్యాన్ని ఇచ్చింది.

– వైష్ణవి, పదవ తరగతి విద్యార్థిని.